సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకురాలు మనీషా ఠాకూర్

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును గోషామహల్ నియోజకవర్గం బీజేపీ మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు మనీషా ఠాకూర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు చిత్తుగా ఓడించి బీజేపీని గెలిపిస్తారని పేర్కొన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా గ్రేటర్ మేయర్ బీజేపీదేనని మనీషా ఠాకూర్ ధీమా వ్యక్తం చేశారు.

ఆర్.కృష్ణయ్యకు సన్మానం



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ఎంపీ ఆర్.కృష్ణయ్యను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాలలో ఆర్.కృష్ణయ్య బీసీల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, వెన్ను శివకుమార్, బుజ్జి కృష్ణ, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

గోల్కొండ: పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌కు పునాది రాళ్లలాంటి వారని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, దళిత నాయకుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ సేవలు వెలకట్టలేనివని అన్నారు. త్వరగా కొలుకొని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన అభిలాషించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 12న వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డు ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ వీఎస్‌ఎస్ నారాయణ మాస్టర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను విద్య, విజ్ఞానంతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా క్రీడా రంగాల్లో అత్యుత్తమ క్రమశిక్షణతో ఉత్తమ భావిపౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి వారిని ఘనంగా సన్మానించి ఈ అవార్డులను ప్రధానం చేయనున్నటతెలిపారు. ఇందుకుగాను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అధ్యాపకుల, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి కార్యాలయంలో కానీ 96523 47207లో సంప్రదించాలని కోరారు.

హబీబ్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

నాంపల్లి: ఓ మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్ రావు తెలిపిన వివరాల ప్రకారం..అఫ్జల్‌సాగర్ మాన్గార్ బస్తీలో నివాసం ఉండే నాగమణి(58) ఇంట్లోనే అల్లం వెల్లుల్లి అమ్ముతూ జీవనోపాధి పొందుతోంది. శనివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని యువకుడు అల్లం వెల్లుల్లి కావాలంటూ ఆమె ఇంటికి వచ్చాడు. బేరమాడి కిలో అల్లం ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ఆమె కిందికి వంగింది. దీంతో నాగమణి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మెహిదీపట్నం-టోలిచౌకీ రోడ్డు ఇలా..

అధ్వాన రోడ్లతో అవస్థలు

- గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. మెహిదీపట్నం మెరాజ్ చౌరస్తా నుంచి గుడిమల్కాపూర్ వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. మెహిదీపట్నం బస్టాప్ నుంచి రేతిబౌలి జంక్షన్ వరకు రోడ్డు అసలు రోడ్డేనా అని తలపించే విధంగా మారింది. నానల్‌నగర్ చౌరస్తా రోడ్డుపై భారీ గుంతలతో వాహనాదారులు ముందుకు సాగడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నానల్‌నగర్ చౌరస్తా వద్ద మ్యాన్‌హోల్ల నుంచి మురుగు బయటకు వస్తూ రోడ్లపై కాలువలా ప్రవహిస్తోంది. అదే విధంగా ఫ్లోర్ మిల్ చౌరస్తా నుంచి లంగర్‌హౌస్ వెళ్లే రోడ్డు సైతం రూపురేఖలు మారిపోయి అధ్వానంగా తయారయ్యింది. రోడ్లపై భారీ గుంతల్లో నిలిచిన బురద నీటితో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి..

భారీ వర్షాలకు టోలిచౌకీ చౌరస్తా గుంతలమయంగా మారింది. రుమాన్ హోటల్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. అదే విధంగా టోలిచౌకీ నుంచి టూంబ్స్ రోడ్డుకు వెళ్లే రోడ్డు గుంతలతో గుర్తుపట్టలేనంతగా మారింది. పాదచారులు ఇక్కడ రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. చౌరస్తా వద్ద నుంచి బజాజ్ షోరూమ్, హీరోహోండా షోరూమ్‌ల ముందు రోడ్లు కూడా భారీ గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఇదిలా ఉండగా టూంబ్స్ చౌరస్తా నుంచి గోల్కొండ వెళ్లే దారిపై నేటికి కూడా వరద నీరు సెవన్ టూంబ్స్ డెక్కన్ పార్కు నుంచి గోల్ఫ్ కోర్సులోకి ప్రవేశిస్తుంది. బంజారా దర్వాజా నుంచి గోల్కొండ కోట చౌరస్తా వరకు రోడ్డు సైతం వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా నానల్‌నగర్ చౌరస్తా

వేదాల ప్రాముఖ్యతను చాటిచెప్పిన వ్యక్తి దయానంద్ సరస్వతి



శోభాయాత్రలో అగ్గోలు దేవిదాస్ తదితరులు

అబిడ్స్: సనాతన ధర్మంలో వేదాల ప్రాముఖ్యతను చాటిచెప్పిన ఏకైక వ్యక్తి ఆర్య సమాజ్ సంస్థాపకుడు స్వామి దయానంద్ సరస్వతి అని సీనియర్ ఆర్య సమాజ్ నాయకుడు, చాదర్‌ఘాట్ ఆర్య సమాజ్ సంస్థాపక సభ్యులు అగ్గోలు దేవిదాస్ అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ..హిందువులలో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు ఆర్య సమాజ్ ఆవిర్భావాన్ని దయానంద్ సరస్వతి స్థాపించారన్నారు. దీంతో స్వాతంత్ర్య ఉద్యమంలో, రజాకార్ల అరాచకాలను ఎదుర్కొనడంలో ఆర్యసమాజ్ కీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం హరికిషన్ వేదాలంకార్ మాట్లాడుతూ..తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో దేశం నలుమూలల లవ్ జీహాద్‌లు పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన్ డాక్టర్ వసుధా శాస్త్రి, ఠాకూర్ లక్ష్మణ్ సింగ్, విఠల్ రావు ఆర్య, గోవింద్ ప్రసాద్ ఉపాధ్యాయ్, కె.నర్సింగ్‌రావు, బ్రిజ్‌గోపాల్ తివారీ, విజేంద్ర ఆర్య, బేజిని చిదానంద కృష్ణా కురుమ, రామనారాయమ ఓంకార్, మనోహర్ సింగ్, నర్సింగ్‌రావు, సుధాకర్ వేద్ పాల్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు



పల్లకీ సేవలో గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన అధికార, అనధికార ప్రముఖులతో పాటు భక్తులందరికీ ధన్యవాదాలని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి మీరాలంమండిలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత వీధులలో అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు కొనసాగి శనివారం తెల్లవారుజాము వరకు తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపునకు భక్తులు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ..ఈసారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించమన్నారు. సహకరించిన ప్రభుత్వ విభాగాల అధికారుల అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అదే విధంగా ఆలయ కమిటీ సేవాదళ్ సభ్యుల బృందం సేవలు అమోఘం అన్నారు.

'మోదీ పథకాలతో స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'



కల్యాణ్ నాయక్

అబిడ్స్: ప్రధాని మోదీ ప్రభుత్వ పథకాలతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్ నాయక్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్, 22 నెలల కాంగ్రెస్ పాలనలతో ప్రజలంతా విసిగిపోయారన్నారు. శనివారం అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఈ నెల 9 నుంచి నెల రోజుల పాటు కొనసాగే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. రైతులు, యువత, నిరుద్యోగులు, మహిళలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. మహిళలందరికీ గత ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. రైతులకు రైతుబంధు ఎకరానికి రెండింతలు చేస్తానన్న హామీలు ఎక్కడ పోయాయన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మహిళలకు, రైతులకు అండగా నిలిచిందన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ కూడా న్యాయంగా జరగకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెళ్లడం దుర్మార్గపు చర్య అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజల వ్యతిరేకతతో పరేషాన్‌లో ఉన్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ప్రజలంతా బీజేపీ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గెలిపించి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెబుతారని కల్యాణ్ నాయక్ పేర్కొన్నారు.

ప్రిన్సిపాల్ శ్రావణికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



అబిడ్స్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ కె.శ్రావణిను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025కు ఎంపిక చేసినట్లు ఆ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ వెల్లడించారు. ప్రతి సంవత్సరం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరిస్తామన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపడుతామన్నారు. శ్రావణితో పాటు ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సూపర్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ ముబాషీర్ మొయినుద్దీన్‌కు ఉత్తమ అవార్డులను అందజేసి సన్మానం చేస్తామన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపులో సంఘం ప్రతినిధులు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా-గౌలిపురా ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గౌలిపురా బతుకమ్మ బావి లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం నుంచి రాజన్నబావి వరకు కొనసాగింది. ఈ ఊరేగింపులో సంఘం అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి పడకంటి వెంకటేశంగుప్తా, ఐపీపీ శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల భిక్షపతిగుప్తా, అడిషనల్ జనరల్ సెక్రటరీ చెరుకు బుచ్చయ్యగుప్తా, అడిషనల్ కోశాధికారి దొంతుల శ్రీనివాస్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్క శేఖర్‌గుప్తా, పీఆర్‌ఓ సరాబు ఉదయ్ భాస్కర్ గుప్తా, గ్రీటింగ్స్ కమిటీ చైర్మన్ బెజుగం చంద్రమోహన్ గుప్తా పాల్గొన్నారు.

వరుస పండుగలతో నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం



నిమజ్జన కార్యక్రమంలో బీజేపీ ఎంపీ డి.కె.అరుణ

గోల్కొండ: వరుస పండుగలతో హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని బీజేపీ ఎంపీ డికె అరుణ పేర్కొన్నారు. కార్వాన్ సబ్జిమండీలోని గంగపుత్ర సంఘంలోని మాతా మహంకాళి ఆలయంలో జరిగిన నిమజ్జనోత్సవానికి శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఏ పండుగ జరిగినా హిందూ సోదరులు భారీ ఎత్తున నిర్వహించి శాంతియుతంగా ముగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దోర్నల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుడిమని చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి పుడుముల విఘ్నేష్, బాలనర్సింహ్మా, వినోద్‌కుమార్, మధుకర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

గాంధీజీ లక్ష విగ్రహాల పంపిణీ ప్రారంభం



కలెక్టర్‌కు మొదటి గాంధీ విగ్రహాన్ని అందిస్తున్న రాజేందర్ రెడ్డి

లంగర్‌హౌస్: సత్యం, అహింస కోసం గాంధీ చూపిన మార్గం కోసం అందరిలో విస్తృత స్థాయి చర్చలు జరిగితేనే వాటి ఆచరణ సాధ్యమని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి అన్నారు. గాంధీజీ లక్ష విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని బాపూఘాట్‌లో ప్రారంభించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ తరపున జిల్లా కలెక్టర్ హరిచందనకు మొదటి విగ్రహాన్ని అందజేశారు. ఇందులో భాగంగా నూలు దండలు వేసిన బాపూజీ విగ్రహాలను బాపూఘాట్‌లో, ఎల్బీ ఇండోర్ స్టేడియంలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ...గాంధీజీ గురించి ఉపన్యాసాలతో సరిపోదని చర్చలు జరిగితేనే ఆయన చూపిన మార్గంలో నడవడం సాధ్యమవుతుందనే దిశలో కార్యక్రమాలు నిర్వహించతలపెట్టామన్నారు. గాంధీ విగ్రహాలు ప్రతి కార్యాలయం, ప్రతి అధికారి టేబుల్‌పై, ప్రతి పాఠశాలలో ఉండాలనే ధ్యేయంతో ప్రస్తుతం లక్ష విగ్రహాల పంపిణీ చేయనున్నామన్నారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న నాలుగు రోజుల కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. హనుమంత రావు, పరమానందం, చంటిబాబు, దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

108 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహం ఏర్పాటు



సీఎంకు విగ్రహం గురించి వివరిస్తున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: రాంలీలా మైదానంలో 108 అడుగుల ఏకశిలా ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు సహకరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని సంగం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా కోరామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి సమక్షంలో రాహుల్‌దాస్ బాబా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..400 ఏళ్ల చరిత్ర ఉన్న త్రివేణి సంగం ఆలయం ప్రాముఖ్యత, ఇక్కడ చనిపోయిన వారి అస్తికల నిమజ్జనం ప్రాముఖ్యతను ముఖ్యమంత్రికి తెలియజేశామన్నారు. ప్రస్తుతం తమ ఆలయ 4 ఎకరాలలో నల్లరాతి ఏకశిలా హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని సీఎంకు వివరించామన్నారు. దీనికి ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసి మరోసారి తనను కార్యాలయంలో కలవాలని చెప్పారన్నారు.



శివలింగం, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు



ప్రముఖ చండీ ఉపాసకులు పాలం మనోహర్ శర్మని కలిసిన ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి ఆలయ ప్రాంగణంలో మరకత శివలింగంతో పాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు నూతనంగా నిర్మించనున్న శివాలయానికి సంబంధించిన ప్రతిష్ఠాపన కార్యక్రమాల కోసం శనివారం ప్రముఖ చండీ ఉపాసకులు పాలం మనోహర్ శర్మని వారి స్వగృహంలో కలిసి పూజా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మరకత శివలింగం, బొడ్రాయి ప్రతి ష్ఠాపన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించామన్నా రు. ఈనెల 23 నుంచి 28 వరకు ప్రాణ ప్రతిష్ఠ, మరకత శివలింగ స్థాపన, పూజా మహోత్సవాలను నిర్వహించనున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంత రాజనర్సింహ చార్యులు, కార్యదర్శులు అనిల్ గౌడ్, సుభాష్ గౌడ్, శ్రీనివాస్, ప్రదీప్, సతీష్, భవాని శంకర్, జగదీష్, గురునాథ్, మధు, ఆనంద్, ప్రణీత్ పాల్గొన్నారు.

10 నుంచి రేణుకా ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రేణుకా ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 8 గంటలకు గురు వందనం, స్వస్తి వచనం, గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 6 గంటలకు స్థాపిత దేవతా హవనములు, మూలమంత్ర జపం, 11న ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా పూజలు, హోమాలు, సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన, 12న ఛండీ హవనం, 10.45 గంటలకు రేణుకా ఎల్లమ్మ అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు.

షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి జి.వివేక్ అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగ ర్, మహాత్మగాంధీనగర్‌లలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించిన కూడా అభివృద్ధి జరగలేదన్నారు. ముఖ్యంగా షేక్‌పేట్ డివిజన్‌లోని ఎన్నో బస్తీ లు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి కట్టుబ డి ఉందన్నారు. షేక్‌పేట్ డివిజన్ సమస్యలపై బస్తీ లు, కాలనీల వాసులు నేరుగా తనను సంప్రదించవచ్చునన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నయీం తదితరులున్నారు.

వైభవంగా దసరా సమ్మేళనం

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ రాంలీలా మైదానంలో దసరా సమ్మేళనం వైభవంగా జరిగింది. ఇతిహాసాలు, చరిత్రను తెలియజేసే చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, కరచార ధ్వనులతో సంగం ప్రాంతం మార్మోగింది. దసరా అనంతరం దసరా సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితి. త్రివేణి సంగం ఆలయంలో ఈ సందర్భంగా అమ్మవార్ల రూపాల్లో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా పూజలు నిర్వహించారు.



వరద ముంపు ప్రాంతాలపై హైడ్రా దృష్టి



లక్డీకాపూల్-మెహిదీపట్నం మార్గంలో నిలిచిన వరద నీటిని తోడేస్తున్న హైడ్రా సిబ్బంది

నాంపల్లి: వరద ముంపు ప్రాంతాలపై హైడ్రా దృష్టి సారించింది. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి లక్డీకాపూల్-మెహిదీపట్నం వెళ్లే ప్రధాన మార్గం వర్షం నీటితో నిండిపోయింది. మోకాలిలోతు నీళ్లతో వాహనదారులు ప్రయాణించడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న హైడ్రా సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని రోడ్డుపై నిలిచిన వరద నీటిని క్లియర్ చేశారు. వరద నీటి కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూశారు. హైడ్రా తీసుకుంటున్న చొరవను స్థానికులు అభినందించారు.

డబ్బు విషయంలో గొడవ.. వ్యక్తిపై కత్తితో దాడి

సంతోష్‌నగర్: డబ్బు విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ స్టేషన్ పరిధిలో హఫీజ్ బాబానగర్‌కు చెందిన షేక్ సైఫ్ (25), అహ్మద్ బిన్ అబ్దుల్లా బావజీర్‌ల మధ్య శనివారం రూ.30 వేల హ్యాండ్ లోన్ విషయంలో గొడవ జరిగింది. దీంతో తీవ్ర కోపోద్రేక్తుడైన అహ్మద్ బిన్ అబ్దుల్లా బావజీర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో షేక్ మెడ, భుజాలపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన షేక్ సైఫ్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



బహుమతులను అందజేస్తున్న వినోద్ కుమార్ సింగ్

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్-క్రీడాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ, చెట్లను నాటడం, కార్యాలయాల్లో పరిశుభ్రత డ్రైవ్, పాత రికార్డులను తొలగించడం, పారేయడం, పారిశుధ్య డ్రైవ్, బయోడిగ్రేడబుల్, బయోడిగ్రేడబుల్ కాని వ్యర్థాలను వేరు చేయడం, పాఠశాల పిల్లలు, గ్రామ నివాసితులు పాల్గొన్న గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్, స్వచ్ఛత అనే అంశంపై రంగోలి, వ్యాస రచన పోటీలు, గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రీడా డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. మన దైనందిన జీవితంలో పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అనంతరం రంగోళి, వ్యాసరచన పోటీల విజేతలకు డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సింగ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్-క్రీడా శాస్త్రవేత్త డాక్టర్ సువాన సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు.